ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.0
కనిష్ఠం 23.0
యాదాద్రి భువనగిరి
5
బుధవారం 27 ఆగస్టు 2025



ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.90 (300.0315)	1,60,940	1,60,940
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.60 (4.09)	1,337.72	1,487.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.814 (38.0890)	2,27,382	1,14,494

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230



గణేశాయనమః

- నవరాత్రి వేడుకలకు సన్నాహాలు
- మట్టి విగ్రహాలకు పెరుగుతున్న ఆదరణ
- వివిధ రూపాల్లో కొలువుదీర నున్న గణనాథులు
- జిల్లాలో సుమారు 4వేల విగ్రహాలు
- రూ.40కోట్ల వ్యయం

భువనగిరి టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రోత్సవాలకు జిల్లా ముస్తాబవుతోంది. జిల్లాలో వీధివీధిన లంబోదరుడి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు భక్తులు సన్నాహాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే విగ్రహాలను మండపాలకు చేర్చగా, కొన్నిచోట్ల మండపాలల్లోనే విశేషాలంకరణలో వినాయక మూర్తులను రూపొందిస్తున్నారు. అయితే గతంతో పోలిస్తే కొద్దిమేర మట్టి విగ్రహాల వినియోగం పెరిగింది.

4వేల విగ్రహాలు, రూ.40కోట్ల వ్యయం

జిల్లాలో సుమారు 4వేల పైబడి వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. వీటికి ఇళ్లలోని విగ్రహాలు అదనం. దీంతో ఊరూవాడ నవరాత్రి వేడుకల సంబరాలు జరుగనున్నాయి. సంప్రదాయాలు, మిగతా 8వ పేజీలో...





పంచాయతీ ఎన్నికలపై
ముందుకు

- కీలక నిర్ణయం ప్రకటించిన ఎన్నికల సంఘం
- సెప్టెంబరు 2న తుది ఓటర్ల జాబితా
- మొత్తం 5.32లక్షల ఓటర్లు
- వార్డుల వారీగా ఓటర్ల విభజన

యాదాద్రి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల సంఘం కీలక నిర్ణయం ప్రకటించింది. సెప్టెంబరు 2వ తేదీ నాటికి గ్రామపంచాయతీల తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తామని వెల్లడించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుగా వేటిని నిర్వహిస్తారనే సందేహం ఇంతకాలం నేతల్లో ఉంది. అయితే ఎన్నికల సంఘం మాత్రం గ్రామపంచాయతీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ప్రక్రియపై వేగం పెంచింది. అందులో భాగంగా గ్రామపంచాయతీల్లో ఓటరు జాబితా సవరణ షెడ్యూల్‌ను విడుదల చేసింది.

ఎన్నికల సంఘం ప్రకటించిన విధంగా ఈ నెల 28న పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితాను అధికారులు విడుదల చేస్తారు. 29న జిల్లాస్థాయి, 30న మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తారు. ఈ నెల 28 నుంచి 30వరకు ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించి సెప్టెంబరు 2న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని ఎన్నికల సంఘం ప్రకటించింది. స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు విధించిన గడువు సమీపిస్తుండటంతో రాష్ట్ర ఎన్నికల సంఘం, పంచాయతీరాజ్‌శాఖ ఎన్నికల నిర్వహణపై వేగం పెంచాయి. జిల్లాలో మొత్తం 17 జడ్పీటీసీ స్థానాలు, 178 ఎంపీటీసీలు, 427 సర్పంచు, 3,704 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. గ్రామపంచాయతీల ఓటర్ల విభజన వార్డుల వారీగా పూర్తయింది. పంచాయతీ కార్యదర్శి లాగిన్‌లోని వార్డులను పరిగణనలోకి తీసుకుని ఓటర్లను విభజించారు. సాధ్యమైనంత వరకు వారు నివసిస్తున్న వార్డులోనే ఓటు ఉండేలా చూస్తున్నారు. ఒక్కో వార్డుకు 300 మంది ఓటర్లలోపు ఉండేలా విభజన ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల నిర్వహణకు ఆర్వోలు, ఏఆర్వోలు, పీవోల నియమాక ప్రక్రియ పూర్తయింది.

మండలం	గ్రామాలు	వార్డులు	మొత్తం
అడ్డగూడూరు	17	150	23,022
ఆలేరు	16	140	21,532
ఆత్మకూరు	23	192	25,533
భువనగిరి	34	294	39,654
బీబీనగర్	34	284	42,876
బొమ్మలరామారం	35	284	29,503
పోచంపల్లి	35	192	27,497
చౌటుప్పల్	26	236	38,501
గుండాల	20	182	26,069
మోటకొండూరు	20	170	21,103
మోత్కూరు	10	88	13,215
నారాయణపూర్	31	260	40,096
రాజపేట	23	206	30,236
రామన్నపేట	24	232	45,358
తుర్కపల్లి	33	266	27,977
వలిగొండ	37	330	52,431
యాదగిరిగుట్ట	23	198	27,615
మొత్తం	427	3704	5,32,218

సామగ్రిని సమకూర్చుకుంటున్న యంత్రాంగం

గ్రామపంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలకు రెండు విడతల్లో మొత్తం 6,889 మంది సిబ్బందిని నియమించనున్నారు. మొత్తం మిగతా 8వ పేజీలో...

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా



ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం గ్రామపంచాయతీల్లోని వార్డుల వారీగా తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నాం. జిల్లాలో మొత్తం 427 గ్రామపంచాయతీలు, 3,704 వార్డులు ఉన్నాయి. పోలింగ్‌స్టేషన్లు 3,704, పోలింగ్ లొకేషన్లు 504 ఉన్నాయి. సెప్టెంబరు 2న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నాం. ఈ మేరకు ఎన్నికల సంఘంతోపాటు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం.

● విష్ణువర్ధన్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో, ఇన్‌చార్జీ డీపీవో



టీఎల్‌ఎం మేళాలో మాట్లాడుతున్న జాని ఆఫ్గాన్

టీఎల్‌ఎం ద్వారా బోధన చేయాలి

జిల్లా విద్యాశాఖ అకాడమిక్ అధికారి జాని ఆఫ్గాన్

ఆలేరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): టీచింగ్ లేర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కటి బోధన అందించాలని విద్యాశాఖ జిల్లా అకడమిక్ అధికారి జాని ఆఫ్గాన్ అన్నారు. మంగళవారం పట్టణంలో మండలస్థాయి పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు టీఎల్‌ఎం రూపొందించడం హర్షణీయమన్నారు. తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ, ఈ మేళా విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎంపీడీవో సత్యఆంజనేయ ప్రసాద్, ఎంఈవో ఎర్ర లక్ష్మి, మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ దాసరి మంజుల, ఆకుల వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయులు రమాదేవి, కోట శ్రీనివాసరావు, రాణి, సుదర్శన్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ చైతన్య, ఎల్‌డీపీ రాధిక, సీఆర్పీలు తిరుపతి, శ్రీను, పరుశరాము, ఐఆర్‌పీ శ్రీను, బాబా, తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్ల రాంచంద్రారెడ్డి ఆదర్శనీయుడు

సీపీఐ జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి



రాంచంద్రారెడ్డి స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఆలేరు రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి మనుషులను మహోన్నతులుగా మార్చిన గొప్ప చరిత్ర ఆరుట్ల రాంచంద్రారెడ్డిదని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొలనుపాకలో తెలంగాణ సాయుధపోరాట యోధుడు భువనగిరి, మాజీ శాసన సభ్యుడు ఆరుట్ల రాంచంద్రారెడ్డి వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాయుధ పోరాటంలో భార్య కమలాదేవితో కలిసి పేదవర్గాల ఉన్నతి కోసం రాంచంద్రారెడ్డి కృషి చేశారన్నారు. వెట్టిచాకిరీ విముక్తి కోసం, భూమి, భుక్తి కోసం జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప కమ్యూనిస్టు యోధుడు అని అన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా ఉద్యమాలు నిర్వహించాలన్నారు. తొలుత ఆయన స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రవి, ఆరుట్ల సుశీలాదేవి, శ్రీకాంత్‌రెడ్డి, మమత, వెంకటేష్, కృష్ణ, రాజయ్య, ఇమ్రాన్, ముత్యాలు, జానమ్మ, రాములు, పరుశరాములు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలి

జడ్పీ సీఈవో శోభారాణి

భువనగిరి రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవడం ద్వారా తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని, అనవసర ఖర్చులు కూడా తగ్గుతాయని జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి అన్నారు. మంగళవారం మండలంలోని కేసారం గ్రామంలో గర్భిణికి 'అమ్మ భరోసా' న్యూట్రీషన్ కిట్టును అందజేశారు. అదే విధంగా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో సీహెచ్.శ్రీనివాస్, ఎంపీవో దినకర్, తదితరులు ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకుంటే పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉంటుందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం మండలంలోని రెడ్డినాయక్‌తండాకు చెందిన గర్భిణీ పల్లవిని కలెక్టర్ పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సమయానికి భోజనం చేసి మందులు వేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేయించుకోవాలని భర్త సంతోష్‌ను కోరారు. పల్లవికి రక్తశాతం తక్కువగా ఉన్నందున హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. వైద్యుల సూచన మేరకు ఐరన్ మందులు ఇంజక్షన్ రూపంలో తీసుకోవడం మంచిదన్నారు. ఈ విషయమై మండల వైద్యాధికారి యామిని శృతి దృష్టిసారించాలని కోరారు. అదేవిధంగా మండలంలోని నాగిరెడ్డిపల్లి, బొల్లేపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను, పారిశుధ్య పనులను కలెక్టర్ తనిఖీచేశారు. ఆయన వెంట ఎంపీవో దినకర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



ముఖగుర్తింపుతో పింఛను పంపిణీ

(ఆంధ్రజ్యోతి, భువనగిరి కలెక్టరేట్): ముఖ గుర్తింపు విధానంతో అర్హులకు పింఛను పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఫేస్ రికగ్నేషన్ పరికరాలను బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లకు అందజేసి మాట్లాడారు. జిల్లాలో పింఛను పంపిణీకి మొత్తం 229 సెట్ల నూతన పరికరాలు మంజూరయ్యాయని, వీటితో ముఖ గుర్తింపు సులభతరం అవుతుందన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ మందికి పింఛను అందజేయవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఏపీవో (పెన్షన్) శ్రీనివాస్, ఏపీవో జంగారెడ్డి, బ్రాంచ్ పోస్టు మాస్టర్లు గంజి మురళి, శంకరయ్య, గణేష్, సత్యనారాయణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీ చామల, ఎమ్మెల్యే సామేలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

అడ్డగూడూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న వాటర్‌ప్లాంట్లను సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీఎస్ఆర్ నిధులు నుంచి ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజల తాగు నీటి సమస్యను తీర్చడానికి ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. పేద ప్రజలకు పరిశుభ్రమైన తాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అదే విధంగా గత ఏడాదిన్నర నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్నామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పేద ప్రజలకు సన్న బియ్యం అందించే ఆలోచన రాలేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఏ గ్రామానికి వెళ్లి చూసినా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఇంటిని కూడా నిరుపేదలకు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాలెంల సాగర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, సీనియర్ నాయకులు పాశం సత్యనారాయణ, ఇటీకాల చిరంజీవి, కొమ్ము సత్యనారాయణ, కేసరాపు శ్రీనివాస్‌రెడ్డి, బాలెంల సైదులు, యుగేందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పండుగ కానుక

- ● 80 మంది ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి
- ● 21 మంది పీఎస్ హెచ్‌ఎంలుగా

6

పంచాయతీల్లో పారిశుధ్యానికి దివీస్ సాయం దోహదం

అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



బ్లీచింగ్ పౌడర్‌ను అందజేస్తున్న దివీస్ ప్రతినిధులు

భువనగిరి గంజ్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామపంచాయతీలకు దివీస్ అందజేస్తున్న సహాయం అభినందనీయమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్‌రావు అన్నారు. చౌటుప్పల్ దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ప్రతినిధులు రూ.4.65లక్షల విలువైన 685 బ్లీచింగ్ పౌడర్, 685 సున్నం బస్తాలను మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా పరిధిలోని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం పనులకు దివీస్ సంస్థ ఎల్లప్పుడూ కృషి చేస్తోందని అన్నారు. గ్రామాల్లో మురుగు కాల్వల్లో, నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లడం ద్వారా దోమలను అరికట్టవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్, కలెక్టరేట్ పరిపాలన అధికారి సీ.జగన్‌ప్రసాద్, డీఎల్పీవో శ్రీకాంత్‌రెడ్డి, దివీస్ ప్రతినిధి, లైజన్ ఆఫీసర్ బి.కిషోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఇసుక మాఫియా భరతం పడతాం'

రాజాపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అనుమతులు తీసుకుని ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే మాఫియా భరతం పడతామని యాదగిరిగుట్ట సీఐ శంకర్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం రాజాపేట మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకుని ఇసుకను డంపులుగా పోసి రాత్రి లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించే వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎస్ఐ షైసయ్య ఉన్నారు.

పాఠశాలలను దత్తత తీసుకోవాలి : డీఈవో



పాముకుంటలో సైకిళ్లను పంపిణీ చేస్తున్న డీవో సత్యనారాయణ

రాజాపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దాతలు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని మౌలిక సదుపాయాలు కల్పించాలని డీఈవో కందుల సత్యనారాయణ కోరారు. మంగళవారం మండల పరిధిలోని పాముకుంట ఉన్నత పాఠశాలలో ఎంపల్లి బుచ్చిరెడ్డి, సకినాల మురళి ఆర్థిక సహాయంతో భువనగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. పారుపల్లి పాఠశాలకు మైక్‌సెట్‌ను అందజేశారు. అనంతరం పారుపల్లి, పాముకుంట పాఠశాలల్లో విద్యార్థులకు సుమంత్ నేత్రాలయ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో చందా రమేష్, ప్రధానోపాధ్యాయులు శశికుమార్, పత్యానంద్, రోటరీక్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సుమంత్‌రెడ్డి, యాదగిరి, కొండల్‌రెడ్డి, పద్మారెడ్డి, ఉపేందర్‌రావు, ఉపాధ్యాయులు పారిజాత, గణేశ్, నారాయణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

తప్పని నిరీక్షణ

మునుగోడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలంలో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెల్లవారుజాము నుంచే స్థానిక సహకార సంఘం వద్దకు తరలివచ్చి యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. గంటల తరబడి క్యూలైన్లో నిలబడినా అవసరమైన యూరియా అందటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంటల పెరుగుదల దశలో ఉన్నాయి. అదునులో అవసరమైన ఎరువుల చల్లుకోవాల్సి ఉన్నా అది అందకపోవటంతో బిక్కమొఖం వేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి తిరుగుతున్నా సరిపడ యూరియా అందటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వచ్చిన కొద్దిపాటి యూరియాను అందరు రైతులకు పంచుతున్న క్రమంలో సరిపడ యూరియా లభ్యంకావటం లేదని పేర్కొన్నారు. మునుగోడు పీఏసీఎస్ వద్ద మంగళవారం రైతులు యూరియా కోసం తరలివచ్చారు. కానీ మొన్న వచ్చిన రైతులకు ఇచ్చిన టోకెన్ల ప్రకారం యూరియా ఉండటంతో మిగిలిన రైతులకు దొరకని పరిస్థితి. దీంతో యూరియా కోసం పడిగాపులతో నరీక్షణ తప్పటం లేదని వారు వాపోతున్నారు.

రెండు బస్తాల కోసం సాయంత్రం వరకూ క్యూలోనే..



యూరియా కొరత రైతులను వెంటాడుతోంది. రెండు బస్తాల యూరియా కోసం గంటల తరబడి క్యూలైన్లలో ఉంటున్నారు. ఆడ, మగ, పిల్లలు, వృద్ధులు తేడా లేకుండా గంటల కొద్దీ నిరీక్షిస్తున్నారు. నల్లగొండ జిల్లా డిండి మండలంలోని తవక్లాపూర్ సొసైటీకి మంగళవారం 222 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు ఉదయం సొసైటీకి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేచి చూస్తే ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందజేశారు. దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు. తవక్లాపూర్ సొసైటీకి 150టన్నుల యూరియా వచ్చిందని సీఈవో తెలిపారు. డిండి ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఈ వానాకాలం 12,500 ఎకరాలు సాగులోకి వచ్చింది. బోరు బావులు ఉన్న రైతులు ముందుగా తుకాలు పోసి వరినాట్లు వేశారు. ముందు నాట్లువేసిన పొలాలు యూరియా చల్లేదశలో ఉండడంతో రైతులు సొసైటీల వద్దకు చేరుకున్నారు. ● ఆంధ్రజ్యోతి, డిండి.

రైతుల గోడు పట్టదా : సీపీఎం

నల్లగొండ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం కష్టాలు పడుతూ రోడ్డు పడ్డ రైతుల గోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టదా అని సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రశ్నించారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో రైతులకు యూరియా అందించాలన్నారు. బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా అధికారులు పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాకు 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని జిల్లా వ్యవసాయ అధికారులు గుర్తించినా, ఇప్పటివరకు కేవలం 49వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా అయిందన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాలు ఒకవైపు పడుతుంటే యూరియా లేకపోవడంతో సేద్యం చేసిన పంటలు తగిన దిగుబడి రాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నారీ ఐలయ్య, డి. మల్లేష్, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, చినపాక లక్ష్మీనారాయణ, వీరపల్లి వెంకటేశ్వర్లు, సలీం ఉన్నారు.

యూరియా కోసం బారులు

హాలియా, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా హాలియా మండలంలోని కొత్తపల్లి పీఏసీఎస్ వద్ద యూరియా కోసం మంగళవారం రైతులు బారులు తీరారు. తెల్లవారుజామునుంచే లైన్లు నిలబడుతున్నామని అయినా సరిపోను యూరియా అందడం లేదని రైతులు ఆవేదనను వ్యక్తం చేశారు. పీఏసీఎస్ వద్ద ఉన్న రైతులతో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడారు. రైతులకు కావాల్సిన యూరియాను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం అక్కడ హాలియా ఏడీఏ సరితతో మాట్లాడి రైతుల కష్టాలను వివరించారు. అలాట్‌మెంట్ ప్రకారం ప్రతి రోజు రైతులకు యూరియా అందిస్తున్నామని ఏడీఏ తెలిపారు.



కొత్తపల్లి పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

రెండోరోజూ పడిగాపులే

కేతేపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లిలో మంగళవారం రెండో రోజు పీఏసీఎస్‌కు 445బస్తాల లారీలోడు యూరియా దిగుమతి అయింది. విషయం తెలిసిన మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఉదయమే కేతేపల్లికి చేరుకున్నారు. అధికారులు ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియా అందజేశారు.

మునగాల: సూర్యాపేట జిల్లా మునగాల మండలకేంద్రంలో యూరియా కోసం రైతులు పాట్లు పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉన్న కొంత మంది యూరియా దొరకకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఎన్నడూ లేని విధంగా యూరియా కొరత ఏర్పడడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



కేతేపల్లి పీఏసీఎస్‌లో యూరియా బస్తాలు దిగుమతి చేస్తున్న హమాలీలు

చిన్నారిని చిదిమేసిన వాహనం



అక్షర(ఫైల్)

కొండమల్లేపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఓ వాహనం చిన్నారిని చిదివేసింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని బాపూజినగర్ మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొండమల్లేపల్లి మండల పరిధిలోని కోల్‌ముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజినగర్‌కు చెందిన పీట్ల రాజు, సంధ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రాజు హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వినాయక చవితి పండుగ కోసం సోమవారం బాపూజినగర్ గ్రామానికి వచ్చారు. మంగళవారం ఉదయం రాజు కుమార్తె అక్షర(4) నానమ్మ సుగుణమ్మతో కలిసి రోడ్డు దాటుతుండగా దేవరకొండ నుంచి కొండమల్లేపల్లి వైపు వేగంగా వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో త్రీవ గాయాలపాలైన అక్షరను చికిత్స నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా కుమార్తె మృతితో తల్లిదండ్రుల కన్నీరుమున్నీరుగా విలపించారు.

బిక్కేరు వాగులో పడి వ్యక్తి మృతి

గుండాల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని అంబాల బిక్కురు వాగులో పడి మంగళవారం ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ తేజంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని నేరేడుమెట్టుకు చెందిన బీర బాలరాజు(53) రెండు రోజుల క్రితం మోత్కూరుకు వచ్చాడు. అక్కడి నుంచి ఆత్మకూర్ మండలం పారుపల్లి గ్రామంలో ఉన్న అత్తగారింటి వద్ద మైసమ్మ పండుగ ఉండడంతో అంబాల శివారు నుంచి కాలినడకన చెక్ డ్యాంపై నడుచుకుంటూ వెళ్తుండగా కాలు జారి చెక్ డ్యాంపై నుంచి ప్రమాదవశాత్తు వాగులో పడిపోయాడు. పరిసర ప్రాంతాల రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాలరాజు కుమారుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెవెన్యూ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్

మోత్కూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు రెవెన్యూ కార్యాలయంలో పహణి నకళ్లు, ఆర్వోఆర్ లెటర్ కాపీ ఇవ్వడానికి రైతుల నుంచి డబ్బులు తీసుకున్న రికార్డు అసిస్టెంట్ బుంగ చరణ్‌రాజ్‌ను కలెక్టర్ హనుమంతరావు సస్పెండ్ చేశారు. పహణిలు వెతికినందుకు తనకు, సంతకాలు చేసినందుకు డిప్యూటీ తహసీల్దార్‌కు ఇవ్వాలని ఇద్దరు రైతుల నుంచి రికార్డు అసిస్టెంటు చరణ్‌రాజ్ రూ.1800 వసూలు చేసిన విషయాన్ని 'పైసలు ఇవ్వందే ఫైల్ కదలదు' శీర్షికన ఈ నెల 25న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ నెల 25న భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి మోత్కూరు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరిపి ఇచ్చిన నివేదికతో కలెక్టర్ హనుమంతరావు రికార్డు అసిస్టెంట్ చరణ్‌రాజ్‌ను సస్పెండ్ చేశారని, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్‌ను రాజాపేటకు డిప్యూటేషన్‌పై పంపారని తహసీల్దార్ పి. జ్యోతి తెలిపారు. రికార్డు అసిస్టెంట్ చరణ్‌రాజ్ నుంచి డబ్బులు రికవరీ చేసి బాధిత రైతులు గంట శ్రీనివాస్‌రెడ్డి, బాసోజు అంజయ్యాచారికి తిరిగి ఇప్పించామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నూతనకల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల పరిధిలోని మాచనపల్లి గ్రామ శివారులో గల పాలేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మాచనపల్లి గ్రామం నుంచి ఇసుక తరలిస్తున్న ఆత్మకూరు ఎస్ మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన రాచకొండ వినయ్ తన ట్రాక్టర్‌తో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి స్వాధీనం

మోతె, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మోతె మండలకేంద్రంలో గంజాయి ప్యాకెట్లతో యువకులు పట్టుబడ్డారు. ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలకేంద్రానికి చెందిన యువకుడు, ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన మరో యువకుడు కలిసి భద్రాచలంలో ఒరిస్సాకు చెందిన ముగ్గురు వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి మోతె గ్రామశివారులో ఉన్న రత్నాలకుంట చెరువు కట్ట వెంట దాచిపెట్టారు. వాటిని మంగళవారం బయటకు తీస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో కలిసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న ఒక కేజీ 200 గ్రాముల గంజాయి ప్యాకెట్లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరితో పాటు మరో ముగ్గురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ డీలర్ సస్పెన్షన్

మేళ్లచెర్వు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ కొట్టె నరసింహారావును సస్పెన్షన్ చేస్తున్నట్లు తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రామాపురంలో వెలుగు చూసిన అక్రమ మద్యం కేసులో ముద్దాయిగా ఉండడంతో రేషన్ డీలర్ నర్సింహారావును సస్పెండ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.



భారీ కొండ చిలువ హతం

వలిగొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం దుప్పెల్లిలో భారీ కొండచిలువను చంపారు. మంగళవారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు పలుసం నర్సయ్య తాటి చెట్టు వద్దకు వెళ్తుండగా 10 అడుగుల భారీ కొండచిలువ కనబడింది. భయంతో దానిని నర్సయ్య చంపివేశాడు.

బిహార్ నుంచి గంజాయి తెచ్చి..

● 10 మంది అరెస్ట్.. పరారీలో ముగ్గురు నిందితులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రం నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్న వారివద్ద నుంచి కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్న నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు వివరాలు వెల్లడించారు. వైష్ణవి రైస్‌మిల్లులో హమాలీగా పనిచేస్తున్న బిహార్ రాష్ట్రం పుడ్‌కి చౌక్, గోగురి టానాకు చెందిన రాజ్‌కుమార్ పటేల్, సికిందర్ మిర్యాలగూడ సీతారాంపురానికి చెందిన సమీర్ బిహార్ నుంచి గంజాయి, గంజాయి చాక్లెట్లను రవాణా చేసి విక్రయిస్తున్నారు. మాడ్గులపల్లి మండలం పూసలపాడు గ్రామానికి చెందిన కొండేటి యశ్వంత్ అలియాస్ చింటూను పరిచయం చేసుకుని అతని ద్వారా మాడ్గులపల్లి మండలంలోని పలువురు యువకులకు విక్రయిస్తున్నాడు. ఈ నెల 25న రాజ్‌కుమార్ పటేల్, చింటూ గంజాయి, గంజాయి చాకెట్లను విక్రయించేందుకు మాడ్గులపల్లి పాత రైల్వేక్వార్టర్ వైపు బండి వెళ్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వెళ్లగా మాడ్గులపల్లి మండలం పూసలపాడుకు చెందిన కోడెల శివ, వ్యవసాయ కూలీ బొల్లెపల్లి విష్ణు, దాచారానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బుర్రి లోకేశ్, పూసలపాడుకు చెందిన వ్యవసాయ కూలీ దైద సందీప్, ట్రాక్టర్ డ్రైవర్ గుండెబోయిన వంశీ, డెకరేషన్ వృత్తి చేసే ఇందుగుల గ్రామానికి చెందిన పందిరి చరణ్ అలియాస్ మాస్, కార్ డ్రైవర్ మి ర్యాల వివేకానందరెడ్డి, దాచారానికి చెందిన బుర్రి నవీన్‌లకు గంజా యి విక్రయిస్తుండగా అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 1350 గ్రాముల గంజాయి, 22గంజాయి చాక్లెట్స్(సెవన్ మినార్ వాటి), ఎనిమిది సెల్ ఫోన్లు, మూడు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బిహార్‌కు చెందిన సికిందర్, మిర్యాలగూడ సీతారాంపురకు చెందిన సమీర్, ఉన్నావ్ నెహ్రూబాగ్‌కు చెందిన చాక్లెట్ కంపెనీ శివంపాఠ్యా డైరెక్టర్లు పరారీలో ఉన్నారు. మొత్తం 13మంది నిందితుల్లో ముగ్గురు పరారీలో ఉన్నారు. పది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ రాజశేఖర్‌రాజు పర్యవేక్షణలో కేసును ఛేది ంచిన రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, మాడ్గులపల్లి ఎస్ఐ క్రిష్ణయ్య, ఏఎస్ఐ నరసింహారావు, జాఫర్, హెడ్ కానిస్టేబుల్ సీహె చ్. శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, పీసీలు ఎం. సైదిరెడ్డి, పి. అనిల్, ఎస్. ఆంజనేయులు, యాదయ్య, నరేష్, సైదులు, శ్రీనునాయక్‌ను డీఎస్పీ అభినందించారు.

ప్రభుత్వ భూమిలో మట్టి దందా

● సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు



ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు మంగళవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. రాజకీయ నాయకుల అండదండలు, వ్యాపార వర్గాల పెత్తనంతో ప్రభుత్వ భూముల్లో అడ్డగోలుగా తవ్వకాలు చేపడుతున్నారు. కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెం.42లో ఉన్న సుమారు 6.5ఎకరాల ప్రభుత్వ భూమిలో తవ్వకాలు చేపడుతూ రేయింబవళ్లు మట్టిదందా సాగిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో ఉన్న గట్టుపక్కనే ఏర్పాటు చేసిన ఓ రైస్‌మిల్లు గోదాం నిర్మాణానికి మట్టి విక్రయిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

భవిష్యత్తు అవసరాలకు భూమి కరువు

కొత్తగూడెం గ్రామంలో నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీతోపాటు అగ్రవర్ణాల పేదలకు భవిష్యత్తులో అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ భూమి ఈ సర్వే నెంబర్‌లోనే ఉంది. ప్రభుత్వం అందించే ఇంటి నిర్మాణాలు, ప్రజా సౌకర్యాల కోసం, భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంటున్నారు. పల్లె ప్రకృతివనం కోసం గత ప్రభుత్వం 2.5ఎకరాల భూమిని కేటాయించగా ప్రస్తుతం కేవలం అర ఎకరంలో మాత్రమే ప్రకృతి వనం దర్శనమిస్తుంది. డంపింగ్‌యార్డు కోసం కేటాయించిన స్థలం సైతం కబ్జాకు గురవుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఎక్స్‌కవేటర్‌తో ప్రభుత్వ భూమిలో గుంతలు ఏర్పడేలా తవ్వి మట్టి దందా సాగిస్తున్నారు. మిల్లు యాజమాన్యం నిర్మిస్తున్న గోదాం స్థలం కొంతభాగం ప్రభుత్వ భూమిలో ఉన్నట్లు పలు రకాల ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. ఈ విషయంపై గ్రామస్థులు సబ్ కలెక్టర్‌ను కలిసి ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా, అక్రమంగా మట్టి తరలించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.



నిర్మాణంలో గోదాముకు మట్టిని తరలిస్తున్న టిప్పర్

రెవెన్యూ అధికారులకు తెలియపరిచాం

కొత్తగూడెం గ్రామంలోని సర్వే నెం.42లో అక్రమ తవ్వకాలు చేపట్టి మట్టి విక్రయాలు చేపడుతున్న విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలియపరిచాం. రెవెన్యూ అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకుంటారు.

● వీరనాయక్, కొత్తగూడెం పంచాయతీ కార్యదర్శి.

విచారణ చేస్తాం

నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిలో అక్రమంగా తవ్వకాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. కొత్తగూడెం గ్రామంలోని ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు చేపట్టే విషయం మా దృష్టికి రాలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

● సురేష్, మిర్యాలగూడ తహసీల్దార్.

ఉపాధ్యాయులకు పండుగ కానుక

● 80 మంది ఎస్‌జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి

● 21 మందికి పీఎస్ హెచ్ఎంలుగా

● అభ్యంతరాలతో ముగ్గురి ప్రమోషన్లు నిలుపుదల

భువనగిరి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రమోషన్ రూపకంలో విద్యాశాఖ ఉపాధ్యాయులకు వినాయక చవితి పండుగ కానుకను ఇచ్చింది. యాదాద్రిభువనగిరి జిల్లాలో 80 మంది స్కూల్ అసిస్టెంట్లుగా, 21 మందికి పీఎస్ హెచ్ఎంలుగా మొత్తం 101మంది ఎస్‌జీటీలకు మంగళవారం పదోన్నతి లభించింది. ఇందులో నలుగురు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కాగా మిగతా 97 మంది లోకల్ బాడీ పాఠశాలల ఉపాధ్యాయులు. ఈ మేరకు డీఈవో కే సత్యనారాయణ పదోన్నతి, బదిలీల ఉత్తర్వులను జారీ చేశారు. అయితే అభ్యంతరాలు రావడంతో ముగ్గురి ప్రమోషన్లను నిలిపివేశారు. అయితే ప్రమోషన్ ఆగిన వారిలో ముగ్గురూ లోకల్ బాడీ ఉపాధ్యాయులే కావడం గమనార్హం. ఇదిలా ఉండగా 22మంది స్కూల్ అసిస్టెంట్లకు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి లభించింది. వరుస ప్రమోషన్ల పర్వంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే బదిలీలు, ఖాళీల పూర్తి ప్రక్రియను కూడా వెంటనే చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వివాదం

రామన్నపేట మండల తుర్కపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎం నిరంజన్‌రెడ్డికి ప్రమోషన్ లభించడంపై ఉపాధ్యాయ సంఘాల తీవ్ర అభ్యంతరం తెలిపాయి. గతంలో చౌటుప్పల్ మండలం ఎంపీపీఎస్ లక్కారంలో పనిచేస్తున్నప్పుడు అదే మండలం మల్కాపూర్ ఎంపీపీఎస్‌కు డిప్యూటేషన్ ఇచ్చారు. కానీ అతను దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరు కావడంతో అప్పట్లో డీఈవో అతడి వేతనాన్ని ఆపారు. అనంతరం అతను తుర్కపల్లికి బదిలీ అయ్యాడు. కానీ ఇప్పటికీ గైర్హాజరు పీరియడ్ వేతనం సెటిల్‌మెంట్ కాలేదు. దీంతో ఏసీసీఏ రూల్స్‌కు వ్యతిరేకంగా ప్రమోషన్లు లభించడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆర్‌జేడీ, కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదులు చేశారు. దీంతో అతడి ప్రమోషన్లు నిలిపివేస్తున్నట్లు డీఈవో ప్రకటించారు. అలాగే ఇతర కారణాలతో మరో ఇద్దరి ప్రమోషన్లను నిలిపివేత జాబితాలో పెట్టినట్లు తెలిపారు.



ప్రమోషన్లు

ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, సోషల్, ఇంగ్లీష్ సబ్జెక్టులలో ఒకరు చొప్పున ముగ్గురికి పీఎస్ హెచ్ఎంగా మరొకరికి మొత్తం నలుగురికి ప్రమోషన్లు లభించాయి. లోకల్ బాడీ స్కూల్స్‌లో 20 మందికి పీఎస్ హెచ్ఎంలుగా, 21 మందికి సైన్స్, 21 మందికి సోషల్, 17 మంది బయోసైన్స్, 15 మందికి గణితం, ముగ్గురికి ఫిజికల్ సైన్స్, ఒకరికి ఉర్దూ మీడియం బయోసైన్స్‌లో స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు లభించాయి.

హక్కుల సాధన కోసం యాదవులు ఐక్యం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడుకొండలు

కనగల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం యాదవులందరూ ఏకం కావాలని అఖిల భారత యాదవ మహాసభ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు కోరారు. మంగళవారం కనగల్ మండల కేంద్రంలో యాదవ సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికఎన్నికల్లో యాదవులు అధిక స్థానాల్లో పోటీ చేయాలని సూచించారు. రాజకీయంగా బలమైన శక్తిగా ఎదిగినప్పుడే హక్కులను సాధించుకోవచ్చన్నారు. సమష్టిగా ఉన్నప్పుడే యాదవులకు రాజకీయాల్లో అధిక ప్రాధాన్యం లభిస్తుందన్నారు. అన్ని పార్టీలు యాదవ కులస్థులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇదిలావుంటే కనగల్‌లో సెప్టెంబరు మొదటి వారంలో నిర్వహించే సమావేశంలో నూతన మండల కమిటీని ఎన్నుకుంటామన్నారు. యాదవ సోదరులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి లోడంగి గోవర్ధన్‌యాదవ్, నాయకులు సుధాకర్, నర్సింహ్మ, శివ, జెట్టి శ్యాంసుందర్, మండలి పరమేషయాదవ్, ఏటెల్లి సైదులు, క్రిష్ణయ్య, మాజీ సర్పంచ్‌లు క్రిష్ణయ్య, యాదయ్య, రామలచ్చయ్య, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

కూర్పుగా కూర్చుని..



యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ విద్యా సంస్థల్లో వినాయకుడి రూపంలో కూర్చున విద్యార్థులు

మట్టి విగ్రహాలనే పూజిద్దాం..



చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని చందన స్కూల్ ప్రిన్సిపాల్ అవ్వారి రామేశ్వరీ కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని విద్యానగర్‌లో గల చందన స్కూల్‌లో మంగళవారం వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిం చారు. విద్యార్థులు మట్టితో తయారు చేసిన రంగురంగుల వినాయక విగ్రహాలను ప్రదర్శించారు. మట్టితో విగ్రహాలను అందంగా తయారు చేసిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రామేశ్వరీ బహుమతులు అందజేశారు.

ఏకదంతాయ.. వక్రతుండాయ

● వినాయక ఉత్సవాలకు వేళాయే..! ● ఉమ్మడి జిల్లాలో ముస్తాబైన మండపాలు

భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మన సంప్రదాయంలో నవరాత్రి ఉత్సవాలు చేసుకుంటాం. మొదటిది చైత్రమాసంలో వచ్చే వసంత నవరాత్రులు. రెండోవి భాద్రపదంలో గణపతి నవరాత్రులు, మూడోవి ఆశ్వయుజంలో శరన్నవరాత్రులు. పల్లెపల్లెలో వినాయ నవరాత్రులు వైభవంగా జరుగుతాయి. నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ప్రత్యేక అలంకరణ చేసిన వీధి మంటపాల్లో ముగ్ధమనోహర రూపంలో మంత్రముగ్దులను చేసే(హరివిల్లు) రంగులు అద్దిన వినాయకులు దర్శనమివ్వనున్నారు. వేద మంత్ర పఠనాలతో వాడ వాడల విఘ్నేశ్వరుడు పూజలు అందుకుంటాడు. మంటపాల్లో భజన కీర్తనలు, భక్తి గీతాలతో నవ రాత్రోత్సవాల్లో గణనాథున్ని భక్తులు మొక్కులు తీర్చుకొని ముక్తిని పొందుతారు. ఏకదంతుడికి ప్రీతికరమైన పిండి వంటలు కుటుంబాల వారిగా తొమ్మిది రోజుల పాటు సమర్పిస్తారు.

మట్టి విగ్రహాలపై అవగాహన

గణనాథుని విగ్రహాల నిమజ్జనంలో జల కాలుష్య నివారణకు మట్టి వినాయకుల ప్రాధాన్యత ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ, సామాజిక వేత్తలు ఎంతగానో ప్రచారం నిర్వహిస్తూనే ఉన్నారు. పర్యావరణ పరిరక్షణకు రసాయనాలతో కూడిన రంగులు అద్దిన విగ్రహాలకు బదులు మట్టి విగ్రహాల పంపిణీ చేసి నీటి కాలుష్య నిర్మూలనకు ప్రభుత్వం పాటుపడుతోంది. సహజ మట్టి విగ్రహాలను విరివిగా అందుబాటులోకి తెచ్చి పర్యావరణాన్ని పరిరక్షించాలని పర్యావరణ వేత్తలు ఆకాంక్షిస్తున్నారు.



నల్లగొండలో మండపానికి తరలిస్తున్న భారీ వినాయక విగ్రహం



సూర్యాపేటలోని రాజీవ్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న భారీ విగ్రహం

చిట్టి చేతుల్లో చక్కగా కుదిరి...

చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన ప్రాథమిక పాఠశాల, గుండ్రాంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలు తయారుచేశారు. మట్టితో ప్రతిమలు తయారుచేయడం ఆనందంగా ఉందని, వాటిని తమ నివాసాల్లో ఏర్పాటుచేసి పూజలు చేస్తామని విద్యార్థులు తెలిపారు. వెలిమినేడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేసి, అభినందించారు. వినాయక చవితి పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పొట్టబత్తుల శ్రీనివాస్, వనజ, చంద్రకళ, సాజీదాసుల్తానా, అనూష, స్వరూప, సంగీత, సుజాత, ప్రవంతి, మాధవి, ప్రవళిక, ఇందిర, సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.



చిట్యాలలో మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలు చూపుతున్న విద్యార్థులు



● పూజా పత్రికి డిమాండ్..

వినాయక పూజల్లో పత్రిని వినియోగిస్తారు. వివిధరకాల ఆకులు, పత్రాలు, పండ్లను స్వామి ముందు ఉంచడం ఆచారం. 21రకాల పత్రులతో పూజలు నిర్వహిస్తారు. ఈ పత్రాలతో పూజించే వారికి సంపదలు, అష్టైశ్వర్యాలు, కార్యసిద్ధి చేకూరుతుందని పండితులు చెబుతారు. అందులో ఆర్య పత్రం, అశ్వత్థపత్రి, గండకి (సీతాఫలం), దత్తూర పత్రం, దూర్వారం, బిల్వ పత్రం (మారేడు) , చూతపత్రం, దాచిమి పత్రం, తులసీపత్రం, ఆపామార్గ, మరువపు పత్రం, విష్ణుకాంత, అర్జునపత్రం, శమీ పత్రం, జాజిపత్రి (సన్నజాజి), సింధూర పత్రం, మాచిపత్రి, బృహస్పతి పత్రం, బవీరి పత్రం, దేవదారు పత్రాలు ప్రధానమైనవి.

● మార్కెట్‌కు కొత్త కళ



వినాయక చవితి వేడుకల సందర్భంగా మార్కెట్లు కళకళలాడాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మార్కెట్‌లో మండపాల అలంకరణకు వినియోగించే వస్తువులతో మార్కెట్ వీధులు నిండిపోయాయి. ఆ మార్గం మొత్తం అలంకరణ వస్తువులతో ఆకట్టుకుంది.

● వినూత్నంగా మండపం..



వినాయక మండపాల ఏర్పాటుకు భక్తులు పోటీపడుతున్నారు. భారీ పరిమాణంలో వివిధ ఆకృతుల్లో అలంకరిస్తున్నారు. భువనగిరిలో వినూత్నంగా ఏర్పాటు చేసిన వినాయక మండపం.

» మట్టి ప్రతిమకు సొబగులు



నల్లగొండ జిల్లాకేంద్రంలో మట్టి వినాయక విగ్రహం

» మూర్తులతో తీర్చిదిద్ది..



యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలో సిద్ధార్థ యూత్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. ఆ విగ్రహానికే కుంకుమ(సింధూరం)తో తయారు చేసిన నాలుగు వేల చిన్న చిన్న ప్రతిమలు ఏర్పాటు చేశారు. ఈ విగ్రహం చూపరులను ఆకట్టుకుంటోంది.

» లంబోదరుడికి బిందె లడ్డూ..



యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో వినాయకుడి కోసం బిందె లడ్డూ

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు అంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణీ వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో, శివాలయంలో నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి.



అంజనేయుడికి హారతి సమర్పిస్తున్న అర్చకులు

టెండర్ల నిర్వహణకు అర్జీ

యాదగిరిగుట్టపైన వర్తకం పేరుతో కొనసాగుతోన్న దుకాణాల తరహాలో నిరుద్యోగ యువత కోసం మరిన్ని దుకాణాలు కేటాయించాలని పట్టణానికి చెందిన కొంతమంది యువకులు దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్, కమిషనర్, ఆలయ ఈవో ఎస్.వెంకట్రావుకు వేర్వేరుగా అర్జీలు అందజేశారు. లేని పక్షంలో అన్ని దుకాణాలకు టెండర్లు నిర్వహించాలని యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన బూడిద నాగరాజు, బూడిద సురేందర్, నక్కల బాలయ్య, ఎల్లేష్, రజనీకాంత్‌తో పాటు మరికొంతమంది యువకులు కోరారు.

సింగిల్ విండో సీఈవోల బదిలీ

మోత్కూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని అన్ని సింగిల్ విండోల కార్యదర్శులను (సీఈవోలను) బదిలీ చేశారు. గతంలో పదవీ విరమణ పొందినప్పుడు ఆ స్థానంలో కొత్తవారిని నియమించడం తప్ప సింగిల్ విండోల కార్యదర్శులకు బదిలీలు ఉండేవి కావు. సింగిల్ విండో వ్యవస్థ ఏర్పడిన నాటి (1985) నుంచి ఇంత వరకు కార్యదర్శుల బదిలీలు జరగలేదు. అలాంటిది రాష్ట్ర ప్రభుత్వ జీవో 44 ప్రకారం ఆకస్మికంగా కార్యదర్శుల మూకుమ్మడిగా బదిలీ చేయడం పట్ల కార్యదర్శులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ హైద్రాబాదు, ఎస్ఎల్ఈసీ కన్వీనర్ ద్వారా పీఏసీఎస్ ఉద్యోగుల బదిలీల కోసం యూనిఫార్మ్ హెచ్ఆర్ పాలసీలోని క్లాజ్ 8(1) నిబంధన అమలుకు మార్గ దర్శకాలు విడుదల చేశారు. ఏ కార్యదర్శి/ఉద్యోగి అయినా ఐదేళ్ల కన్నా ఎక్కువ కాలం ఒకే సంఘంలో పని చేయరాదన్న నిబంధన మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా (నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు) పరిధిలోని సింగిల్ విండోల కార్యదర్శుల బదిలీలు చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సింగిల్ విండోల కార్యదర్శులందరినీ ఒకే సారి బదిలీ చేయడం సింగిల్ విండో చరిత్రలో ఇదే తొలిసారి. బదిలీలు చేయడానికి కార్యదర్శుల నుంచి తొలుత నాలుగు ఆప్షన్లు తీసుకున్నప్పటికీ వారు ఇచ్చిన ఆప్షన్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా డీఎల్ఈసీ ఈ నెల 25న కార్యదర్శులందరినీ ఒకేసారి బదిలీలు చేసిందంటున్నారు. ఈ బదిలీల్లో భాగంగా మోత్కూరు రైతుసేవా సహకార సంఘం కార్యదర్శి అడ్డగూడూరు సింగిల్‌విండోకు, అడ్డగూడూరు సింగిల్ విండో కార్యదర్శి మోత్కూరుకు బదిలీ అయ్యారు.

దేశ రక్షణకు ఎన్‌సీసీ దోహదం

నల్లగొండ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సామాజిక శిక్షణ, దేశ రక్షణకు ఎన్‌సీసీ దోహద పడుతుందని కల్నల్ లక్ష్మారెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థుల ఎంపిక మంగళవారం విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణంలో 31వ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ వారిలో ఔత్సాహితులను 400 మీటర్ల పరుగు, ఎత్తు, బరువు ఆరోగ్యం , రాత పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు. ఈ ఎంపికకు 60 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో మెరుగైన ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేయనున్నట్లు ఎంజీయూ ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ డాక్టర్ మశ్చేందర్ తెలిపారు. అనంతరం కల్నల్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సామాజిక అంశాలపై స్పృహ శిక్షణ కల్పిస్తూ పాల్పంచుకునే అవకాశం ఎన్‌సీసీ ద్వారా లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.సుధారాణి, బెటాలియన్ అధికారులు కొమ్ము మల్లయ్య, చంద్రవీర్, మాదవరావు పాల్గొన్నారు.

భావోద్వేగ స్థిరత్వం సాధించాలి

● బెస్తి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ కె.నాగజ్యోతి

నల్లగొండ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఒత్తిడి మయ జీవితంలో భావోద్వేగ స్థిరత్వం సాధించాలని బెస్తి యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ కె.నాగజ్యోతి అన్నారు. మంగళవారం నాగార్జున ప్రభుత్వ కళాశాలలో జీవశాస్త్రాల ఆధ్వర్యంలో 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు - జీవశాస్త్రాల పాత్ర' అనే అంశంపై జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవశాస్త్రాల సుస్థిరతతో పాటు మనిషి భావోద్వేగ సుస్థిరత, అల్గోరిథమిక్ సుస్థిరతలను కూడా సాధించాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. ఒత్తిడి నుంచి దూరం కావడానికి తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 70 శాతం రోగాలు సామాజిక మాధ్యమాలతోనే వస్తున్నాయని తెలిపారు. ఇన్నేళ్లు గడిచినా ఇండియా కేవలం 65 శాతం మాత్రమే సుస్థిరత సాధించిందని అన్నారు. 2030 నాటికి ఇండియా 100 శాతం సుస్థిరత సాధిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మహిళలు నాయకత్వ బాధ్యతను చేపట్టడానికి ముందుకు రావడం లేదని, ఇది మారాలని అన్నారు. గద్ద కూడా తన శక్తిని గ్రహించకుండా కోడిపిల్లలతో పెరిగితే కోడిలాగే తయారవుతుందని అన్నారు. పరస్పరం ప్రోత్సహించుకుని, కుటుంబ సభ్యుల సహకారంతో మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని అన్నారు. నేర్చుకోవడానికి హద్దు లేదని అది జీవితాంతం కొనసాగే నిరంతర ప్రక్రియ అని అన్నారు. కృత్రిమ మేధ మన జీవితాల్లోకి చొచ్చుకు వచ్చిన తరువాత మనం మరింత అడ్వాన్స్ కావాలని అన్నారు. ఎప్పటికీ సేఫ్‌జోన్‌లో ఉండకుండా వీలయితే అనేక ప్రదేశాలు తిరిగి వివిధ సంస్కృతులను తెలుసుకోవాలన్నారు. హార్డ్ వర్క్ ఎప్పుడూ వృధా కాదనే విషయం విద్యార్థులు గమనించాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ మాట్లాడుతూ రెండు రోజుల సదస్సు విజయవంతం అయిందని, విద్యార్థులు ఈ సదస్సు ద్వారా ఎంతో నేర్చుకున్నారని నిర్వాహకులను అభినందించారు. సదస్సు సంచాలకుడు డాక్టర్ ఎం.అనిల్‌కుమార్ రెండు రోజుల సదస్సు నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసన్నకుమార్, సదస్సు కో కన్వీనర్ డాక్టర్ బొజ్జ అనిల్‌కుమార్, అధ్యాపకులు సుధాకర్, డాక్టర్ జ్యోత్స్న, శివరాణి, శిరీష, సిద్దేశ్, కృష్ణ, కోటయ్య, సరిత, మహేశ్వరి, అంకుష్, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బెస్తి యూనివర్శిటీ వైస్ ఛాన్స్‌లర్ కె.నాగజ్యోతి

మహిళా శిశు సంక్షేమానికి ప్రాధాన్యం



కలెక్టర్ హనుమంతరావు, సంక్షేమ శాఖ సిబ్బందితో మహిళా శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోతీ

భువనగిరి (కలెక్టరేట్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మహిళా శిశు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఈమేరకు ఉద్యోగులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.మోతి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు సిబ్బందితో జిల్లాలో మహిళా శిశు సంక్షేమం-ప్రభుత్వ పథకాల అమలు వాటి ప్రగతిపై సమీక్షించారు. శాఖాపరమైన అభివృద్ధి పనులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసి రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లాను ముందంజలో నిలపాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు బాల సదనం సందర్శించి జిల్లా మాలల పరిరక్షణ విభాగం ఉద్యోగులు సిబ్బందికి ఇన్‌స్టిట్యూట్స్ సందర్శనలు, పిల్లల ఫాలోఅప్‌ల వివరాలను నమోదుపై పలు సూచనలు ఇచ్చారు. పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కరరావు, ఆర్డీవో క్రిష్ణారెడ్డి, జిల్లా సంక్షేమాధికారి కొండాపురం నర్సింహారావు, సీడీపీవోలు విజయలక్ష్మి, శ్వేత, అనంత లక్ష్మి, డీడబ్ల్యూవో సూపరింటెండెంట్ శశికళ, యశోద పాల్గొన్నారు.

టీచర్..మమ్మల్ని విడిచి వెళ్లొద్దు

● వీడ్కోలు కార్యక్రమంలో వేడుకున్న విద్యార్థినులు

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మమ్మల్ని విడిచి వెళ్లొద్దు టీచర్ అంటూ పలువురు విద్యార్థినులు బోరు న విలపించారు. మంగళవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల పరిషత్ పాఠశాలలో ఈ సంఘటన జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులిగా విధు లు నిర్వర్తిస్తున్న పి.వనజ బదిలీపై మోతె మండలం నామవరం పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్‌గా బయోసైన్స్ పదోన్నతిపై వెళుతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు ఆమెకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థిను లు ఆమెను పట్టుకొని పాఠశాలను, తమను విడిచి వెళ్లవద్దు అంటూ బోరున కంటతడిపెట్టారు. 'మా టీచర్ మాకే ఉండా లి' అంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు. పదోన్నతిపై వెళుతున్న ఆమెకు అడ్డు పడుతూ టీచర్‌పై పట్టుకుని ఏడుస్తున్న విద్యార్థినులను ఓదార్చడం అక్కడున్న అధికారులు, తోటి ఉపాధ్యాయుల వల్ల కూడా కాలేదు. టీచర్‌పై విద్యార్థులు చూపుతున్న అభిమానికి, ఆవేదనకు సైతం అధికారులు, ఇతర ఉపాధ్యాయులు కంట తడి పెట్టారు. ఏడు సంవత్సరాలుగా పి.వనజ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు గా విద్యార్థులకు క్రమశిక్షణను అలవాటు చేశారు. అంతకుముందు బదిలీపై వెళుతున్న వనజను ఎంఈవో ధారాసింగ్, కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు పి.శ్రవణ్‌కుమార్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.



ఉపాధ్యాయురాలు పి.వనజను పట్టుకుని విలపిస్తున్న విద్యార్థినులు

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

● విద్యాశాఖ ఫైనాన్స్, అకౌంట్ అధికారి యోగేంద్రనాథ్

చిట్యాలరూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడల్లో రాణించాలని విద్యాశాఖ ఫైనాన్స్ అకౌంట్ అధికారి యోగేంద్రనాథ్ అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభను చూపగా విజేతలకు బహుమతులందజేశారు. ఈసందర్భంగా యోగేంద్రనాథ్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తూనే క్రీడలపై మక్కువను పెంచుకోవాలన్నారు. పలు క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు మెళకువలను నేర్చుకుంటూ ప్రతిభను కనబరచి రాణించాలన్నారు. క్రీడల్లో రాణించినట్లయితే ఉద్యోగ, ఉపాధిరంగాల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యార్థులకు ఏదుళ్ల రఘుపతిరెడ్డి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. భోజన సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేయడంతో రఘుపతిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో పానుగోతు సైదానాయక్, ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీధర్, నీలకంఠం నరేష్, తాటి చంద్రమౌళి, గుండెబోయిన నర్సింహ, చేకూరి గణేష్, శిర్సు సైదులు, మర్రి శ్రవణ్‌కుమార్, ఏదుళ్ళ కొండల్‌రెడ్డి, లుకేందర్ రెడ్డి, రాధ, యశోధరరెడ్డి, కైలాష్, లచ్చిరెడ్డి, యాదగిరిరెడ్డి, రవీందర్, విజయలక్ష్మి, యుగంధర్‌రెడ్డి, బ్రహ్మయ్య, శ్రీదేవవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

6.2 కిలోల కణితి తొలగింపు

● నల్లగొండ జిల్లా మహిళకు భువనగిరిలో శస్త్ర చికిత్స

భువనగిరి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వివాహిత మహిళ గర్భం నుంచి 6.2 కిలోల క్యాన్సర్ కణితి తొలగించిన అరుదైన శస్త్ర చికిత్స మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో జరిగింది. నల్లగొండ జిల్లా చిట్యాల మండలానికి చెందిన మహిళ(50) కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యానికి గురైంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన రోగనిర్ధారణ పరీక్షల్లో ఆమె కడుపులో కణితి ఉన్నట్టు తేలింది. దీంతో ప్రముఖ అంకాలజీ సర్జన్ డాక్టర్ మహేష్, అనస్తీషియా డాక్టర్ మధుకుమార్ భువనగిరిలోని జయలక్ష్మీ హాస్పిటలో ఆమెకు శస్త్ర చికిత్స చేసి క్యాన్సర్ కణితిని తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. త్వరలోనే కోలుకొని సాధారణ జీవితం గడుపుతుందని వైద్యులు పేర్కొంటున్నారు.

వరద కాల్వ నిర్మించాలి

రామన్నపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రలోని చాకలి కుంట నుంచి హాస్పిటల్ వరకు వరద కాల్వ నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు కందుల హనుమంతు, కార్యదర్శి మునుకుంట్ల లెనిన్ డిమాండ్ చేశారు. రామన్నపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. నేతాజీ క్లబ్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చుట్టు ఫినిషింగ్ ఏర్పాటు చేయాలని, అన్ని వార్డుల్లో చేతిపంపు బోర్లను పునరుద్ధరించాలని కోరారు.

జిల్లా స్థాయి క్రీడలకు 'క్రిష్ణవేణి' విద్యార్థుల ఎంపిక

రామన్నపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి క్రీడా పోటీలకు మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందన విద్యార్థులు అధిక సంఖ్యలో ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందన పలువురు విద్యార్థులు మండల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. బి.చైత్ర, కె.వర్షిత్, కె.శివ, పి.అక్షయ్, ఎస్.చరణ్, అనుశ్రీతో పాటు పలువురు ఎంపికైనట్లు తెలిపారు.

గణేశాయనమః

(5వ పేజీ తరువాయి)

స్థానిక పరిస్థితులను బట్టి 3, 5, 9, 11 రోజులకు విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. చాలాచోట్ల నవరాత్రుల అనంతరం సెప్టెంబరు 6న సామూహిక గణేశ్ శోభాయాత్రలు నిర్వహించి చెరువులు, నదులు, వాగుల్లో నిమజ్జనం చేయనున్నారు. ఈ ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.40కోట్ల పైబడి వ్యయం కానుంది. ఉత్సవాలతో భక్తిభావంతో పాటు ఐక్యమత్యం పెరగనుంది.

పెరగనున్న టర్నోవర్

వినాయక చవితి వేడుకల నేపథ్యంలో వివిధ రకాల మార్కెట్లకు డిమాండ్ పెరిగింది. పండ్లు, పూలు, పూజా సామాగ్రి, అలంకరణ, కిరాణం విక్రయాలు, లైట్లు, మైక్ సౌండ్, పందిళ్ల వినియోగం పెరగడం, పూజారులు, కళాకారులు, బ్యాండ్, కూలీలు తదితరులకు గణనీయంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అదే సమయంలో సమాజంలో మార్కెట్‌లో డబ్బుల టర్నోవర్ భారీగా పెరుగుతుందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా సాగేలా పోలీస్, మునిసిపాలిటీ, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపక, వైద్య, ఆరోగ్య ప్రభుత్వ శాఖలు, గణేశ్ ఉత్సవ సమితి సమన్వయంగా పనిచేస్తున్నాయి.

వివిధ రూపాల్లో..

గణేశ్ మండపాల నిర్వాహకుల మధ్య పోటీతత్వంతో వివిధ రూపాల్లో ఆదిదేవుడు భక్తులకు దర్శనమివ్వనున్నాడు. ఈ మేరకు జిల్లా కేంద్రం భువనగిరి తారకరామానగర్‌లోని శ్రీమణికుంట యూత్ అసోసియేషన్ మండపంలో ఆపరేషన్ సిందూ రూపంలో గణనాథుడు, మరో 20 మట్టి విగ్రహాలను రూ.8లక్షల వ్యయంతో మండపంలోనే రూపొందిస్తున్నారు. కిసాన్‌నగర్ యూత్ మండపంలో రూ.6లక్షలతో భక్త ప్రహ్లాదుడికి లక్ష్మీనర్సింహస్వామి దర్శనంతో కూడిన 30మట్టి విగ్రహాల దేవతామూర్తులతో కూడిన వినాయక మండపాన్ని సిద్ధం చేస్తున్నారు. అలాగే అరుంధతి అసోసియేషన్‌లో కూడా రూ.లక్షల వ్యయంతో భారీ మట్టి విగ్రహాన్ని స్థానికంగానే ఒడిశా కళాకారులు తీర్చిదిద్దుతున్నారు. హనుమాన్‌వాడలో కేదారీశ్వరి ఆలయ మండపం, శ్రీరాంతడాక్, భక్తభజనమండలితో పాటు జిల్లాలో పలు రూపాల్లో భారీ విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పా ట్లు చేస్తున్నారు. బుధవారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా అంతటా మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నారు.



భువనగిరిలో గణేశుడి పూజకు పత్రిని కొనుగోలు చేస్తున్న మహిళలు

పంచాయతీ ఎన్నికలపై ముందుకు

(5వ పేజీ తరువాయి)

5,734 మంది పోలింగ్ సిబ్బందికి అదనంగా 1,155 మందిని నియమించారు. వీరికి శిక్షణను కూడా ఇచ్చారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఎన్నికల సామగ్రిని జిల్లా యంత్రాంగం సమకూర్చుకుంటోంది. ఇప్పటికే జిల్లాలో బ్యాలెట్ పెట్టెలు సిద్ధం చేయగా, బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయింది. బ్యాలెట్ బాక్సుల కొరత ఉండటంతో గుజరాత్ రాష్ట్రం నుంచి తెప్పించారు. ఎన్నికల నిర్వహణకు 2,251 బ్యాలెట్ బాక్కులకు ప్రస్తుతం 1,650 వరకు ఉన్నాయి. అదనంగా 601 వరకు బ్యాలెట్ బాక్సులు తెప్పిస్తున్నారు. జడ్పీటీసీ 17, ఎంపీటీసీ 178, ఎంపీటీసీల పోలింగ్ స్టేషన్లు 995, పోలింగ్ లోకేషన్లు 461 ఉన్నాయి. మొత్తం 1,650 బ్యాలెట్ బ్యాక్సులను అదనంగా మరో 284 వరకు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయగానే ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది.

జిల్లాలో 5.32లక్షల మంది ఓటర్లు

గ్రామీణ ప్రాంతాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 427 గ్రామపంచాయతీల పరిధిలో 3,704 వార్డులు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 5,32,218 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,64,567 మంది, మహిళలు 2,67,649 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. జిల్లాలోని పంచాయతీలు, వార్డులు, మండల, జిల్లా పరిషత్ స్థానాల వారీగా ఓటర్ల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు.



పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

భువనగిరి రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య డిమాండ్‌చేశారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చీమల కొండూరు గ్రామంలో ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందచేశారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి: డీవైఎఫ్ఐ

భువనగిరి రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రహదారులకు మరమ్మతులు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్, సహాయ కార్యదర్శి దయ్యాల మల్లేశ్ కోరారు. మంగళవారం మండలంలోని హన్మాపురం నుంచి అనంతారం వెళ్లే రహదారిపై డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి

వలిగొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కార్యవర్గ సభ్యుడు మెరుగు వెంకటేశం డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఎం.తుర్కపల్లి, ప్రొద్దటూరు గ్రామాల్లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కార్యదర్శులకు వినతిపత్రం ందజేశారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాలు, లింగం, స్వామి, మల్లేశం, నర్సిరెడ్డి, అయిలయ్య, నర్సింహ, బాలశంకర్, సంజీవరెడ్డి, శంకర్‌రెడ్డి, మత్స్యగిరి, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

వలిగొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏలే చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కొప్పుల యాదిరెడ్డిని సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని అన్నారు. ప్రపంచ భారతదేశాన్ని గురువుగా తీర్చిదిద్దడానికి మోదీ చేస్తున్న కృషి ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు బోళ్ల సుదర్శన్, నాయకులు తనీషా, శ్రీనివాస్, రామనర్సు, లక్ష్మీ, దుర్గయ్య, అమరేందర్, దాయకర్, నాగరాజు, లింగస్వామి, వెంకటేశం, నరేందరెడ్డి, దానయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలను పెంచాలి

వలిగొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలను పెంచాలని ఎంపీడీవో జలందర్‌రెడ్డి సూచంచారు. మంగళవారం మండలంలోని వర్కట్‌పల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రతలు, పౌష్టికాహారంపై వివరించారు. అమ్మ భరోసా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ జ్యోతి, హెచ్‌ఈవో వెంకటరమణ పంచాయతీ కార్యదర్శి ఏఎన్ఎం, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తడక వెంకటేష్, పోచంపల్లి అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్ మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు నిర్వహించిన పలు క్రీడా, సాంస్కృతిక, వ్యాసరచన, వకృత్వ పోటీల్లో ప్రతిభను చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తడక వెంకటేష్, తడక రమేష్‌తోపాటు పాఠశాల హెచ్ఎం క్రిష్టయ్య, ఉపాధ్యాయులు బ్రహ్మచారి, అనిత, పీడీ ఉపేందర్, స్థానిక నాయకులు ప్రవీణ్, విష్ణు, కుడికాల బాలనర్సింహ, రామచంద్రం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యార్థులకు ఆట వస్తువుల పంపిణీ

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పిలాయిపల్లిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు మాజీ సర్పంచు అందెల హరీష్ యాదవ్ మంగళవారం ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గూడూరు అంజిరెడ్డి, గూడూరు బుచ్చిరెడ్డి, పత్తి భిక్షపతి, ప్యాట చంద్రశేఖర్, బింగి మహేష్, బాలనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనం

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మాధక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనం అవుతాయని చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ అన్నారు. స్థానిక శ్రీ గాయత్రీ జూనియర్ కళాశాలలో మంగళవారం మాధక ద్రవ్యాల వినియోగంతో నెలకొంటున్న దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సదస్సులో ఎస్ఐ అజయ్ భార్గవ్, ఏఎస్ఐ జానయ్య, మమత తదితరులు పాల్గొన్నారు.

'విజ్ఞాన్స్'లో కోలాహలంగా ఎకో గణేష్ తయారీ పోటీలు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని చేయని మట్టితో తయారైన వినాయక విగ్రహాలనే పూజించి పర్యావరణ హితంగా గణేష్ చతుర్థిని జరుపుకోవాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుబ్బారావు అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామంలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో మంగళవారం ఎకో గణేష్ తయారీ పోటీలను నిర్వహించారు. మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో విద్యార్థులు మట్టి విగ్రహాలు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఎం సుబ్బారావు, యూనివర్సిటీ అడ్వయిజర్ రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య, ఆయా విభాగాల డీన్లు, డైరెక్టర్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించాలి



భువనగిరిలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

భువనగిరి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలో న్యాయవాది శ్రీకాంత్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరి కోర్టులో నిరసన తెలిపారు. న్యాయవాదిపై జరిగిన దాడిని న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా పరిగణిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కుక్కదూవ సోమయ్య, బొల్లెపల్లి కుమార్, తడక మోహన్, పాల్వంచ జగతయ్య, ఎండీ నేహల్, సీసా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్యం వెంకటాచలపతి, న్యాయవాదులు రాసోలు వేణు, పి.మహిపాల్‌రెడ్డి, జల్ల రమేష్, జక్కర్తి శేఖర్, డి.శ్రీశైలం, జ్యోతి, ఖయ్యూమ్ పాషా, ఊడుగు శ్రీనివాస్, వి.నర్సింహారెడ్డి, ఎం.సత్తిరెడ్డి, పరమేష్, మోహన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'ఆసరా పింఛన్లు పెంచాలి'

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 26, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆసరా పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బీర్రు మహేందర్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండలంలోని కాచారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో పింఛన్లు పెంచుతానని హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పాటయ్యి 19నెలలు గడిచినప్పటికీ ఇప్పటి వరకు పింఛన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కందుల శంకర్, కాచారం మాజీ సర్పంచ్ అశోక్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు బూడిద జాని, సుంచు దేవయ్య, సుంచు బాలయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కొరటికల్ గ్రామ మాజీ సర్పంచ్ పెండెం లక్ష్మీనారాయణ అనారోగ్యంతో, అదే గ్రామానికి చెందిన కట్టెకోల ప్రభాకర్ అనే గీతకార్మికుడు రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి మంగళవారం కొరటికల్‌లో మృతుల చిత్ర పటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యాస ఇంద్రారెడ్డి, కోరె బిక్షపతి, మాజీ సర్పంచులు పెండెం పురుషోత్తం ,కోల సత్తయ్య పాల్గొన్నారు.

చెట్లను విక్రయించిన వారిపై చర్య తీసుకోవాలి

మోత్కూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండలం దాచారం గ్రామానికి వెళ్లే రోడ్డు వెంట రోడ్డు పరిధిలో ప్రభుత్వం పెంచిన చెట్లను అక్రమంగా విక్రయించిన వారిపై, నరికి తీసుకెళుతున్న వారిపై చర్య తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. రోడ్డు వెంట సుమారు 18 ఏళ్ల కిత్రం మొక్కలు నాటి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఎడ్ల బండిపై డ్రమ్ముల్లో నీరు తెచ్చి పోసి పెంచామన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ పి.జ్యోతి మాట్లాడుతూ చెట్ల నరికివేత గురించి అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. వారు తగిన చర్యలు తీసుకుంటామనిపేర్కొన్నారని తెలిపారు.

ఇసుక మాఫియా భరతం పడుతాం: సీఐ

రాజాపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అనుమతులు తీసుకుని ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే ఇసుక మాఫియా భరతం పడుతామని యాదగిరిగుట్ట సీఐ శంకర్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం రాజాపేట మండల కేంద్రం లోని పోలీస్‌స్టేషన్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తహసిల్దార్ కార్యాలయం నుంచి ఇసుక అనుమతులు తీసుకుని డంపులుగా పోసి రాత్రిపూట లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించే వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించేవారిపై క ఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక ఉత్సవాలలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎస్ఐ అనిల్‌కుమార్, ఎఎస్ఐ షైసయ్య తదితరులు పాల్గొన్నారు.













పర్యావరణ పండుగగా నిర్వహించుకోవాలి

● **అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు**

భువనగిరి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితిని పర్యావరణ పండుగగా నిర్వహించుకోవాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. భువనగిరి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన మట్టి వినాయక విగ్రహాల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణం కూడా ఒక దేవుడి రూపమేనని, మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజిస్తే పర్యావరణానికి మేలు చేసినట్టేనని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేజ్‌చిస్తి, కమిషనర్ జి రామలింగం పాల్గొన్నారు.



భువనగిరిలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

● పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరిలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. నవరాత్రి ఉత్సవాలలో ప్లాస్టిక్ వస్తువులను బహిష్కరించాలని కోరారు. జిల్లా తూనికల కొలతల శాఖ అధికారి కందగట్ల వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బిజ్జాల మహేష్, బచ్చు రమేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్తా, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆకుల రమేష్, మంచాల రుషికేశ్, పసుపునూరి మనోహర్ పాల్గొన్నారు.

ఆలేరు/ ఆలేరు రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించాలని ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్ కోరారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలేరు హై స్కూల్‌లో ఎన్‌సీసీ విభాగం ఏకో గణేష మట్టి వినాయక అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ రాగుల సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పోరెడ్డి రంగయ్య, నరేంద్రస్వామి, సైదులు, పరమేశ్వర్, శంకర్‌రెడ్డి, మేగారాజు, స్వర్ణలత, ప్రేమలత, జ్ఞాన ప్రసున్న, కవిత, మున్సిపాలిటీ కమీషనర్ శ్రీనివాస్, మేనేజర్ జగన్మోహన్ పాల్గొన్నారు. విద్యుత్ తీగల కింద వినాయక మండపాలను ఏర్పాటు చేయొద్దని ఆలేరు సీఐ యాలాద్రి అన్నారు.

మోత్కూరు : ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని మునిసిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్ కోరారు. మంగళవారం మోత్కూరు మునిసిపాలిటీ కార్యాలయ ఆవరణలో నిర్వహించి శాంతి కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్ పి.జ్యోతి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సతీష్, ఎంపీడీవో డి.బాలాజీ, విద్యుత్ ఏఈ ప్రభాకర్‌రెడ్డి, నీటి పారుదల శాఖ ఏఈ అఖిల్, ఆర్‌అండ్‌బీ ఏఈ స్వామి, ప్రభాకర్, మెప్మా డీఎంసీ రమేష్ పాల్గొన్నారు.

వలిగొండ: మట్టి గణనాథులనే పూజించాలని మత్స్యగిరి దేవస్థానం ఈవో మోహన్‌బాబు తెలిపారు. మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో శ్రీ మత్స్యగరి దేవస్థానం గుట్ట పైన మట్టి గణపతులను భక్తులకు ఈవో పంపిణీ చేశారు. నాయకులు బెలిదే నాగేశ్వర్, బాశెట్టి కృష్ణమూర్తి, జయమ్మ, ప్రణవనాథ్, మంజునాథ్, సంతోష్, రమేష్ పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి: డీసీపీ

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనాల సందర్భంగా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా డీసీపీ అక్షాంశ్‌యాదవ్ అన్నారు. మంగళవారం చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం, పెద్దకొండూరు చెరువులను ఆయన పరిశీలించారు. నిమజ్జనాలు జరిగే చెరువుల వద్ద లైట్లు, క్రేన్లు, గజ ఈతగాళ్లను, రక్షణ సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. పిల్లలు, ఈత రాని వాళ్లను చెరువులకు దూరంగా ఉంచాలన్నారు. వాహనాలు వెళ్లేదారులను చదును చేయాలని ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. భక్తిభావంతో వినాయక ఉత్సవాలు నిర్వహించి నిమజ్జనాలను శాంతియుతంగా జరుపుకునే విధంగా చేయాలన్నారు. ఆయన వెంట ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ మన్మధకుమార్, తహసీల్దార్ మీరాబాయి, ఆర్ఐ రాంరెడ్డి పాల్గొన్నారు.



దండుమల్కాపురంలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ , ఏసీపీ

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట డివిజన్, పట్టణ, ఆయా గ్రామాల్లో వినాయక మంటపాల వద్ద డీజేలను నిషేధించామని, ఒకవేళ ఉత్సవ కమిటీలు నియమాలను ఉల్లంఘించి డీజేలను ఏర్పాటు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాసనాయుడు హెచ్చరించారు. మంగళవారం గుట్టలో విలేకరులతో మాట్లాడారు. మంటపాల వద్ద విద్యుత్ కనెక్షన్ ఆ శాఖ లైన్‌మన్ల ద్వారానే తీసుకోవాలని, సొంత ప్రయోగాలు చేయొద్దని హెచ్చరించారు. ఆయనతో పాటుగా స్థానిక సీఐ భాస్కర్, సిబ్బంది ఉన్నారు.



గుట్టలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు







